నిందితులను ఉరితీయాలి

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వైద్యుల నిరసనలు, ర్యాలీలు

ఆమనగల్లు : హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మానవహారం రూపంగా నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 17 : కోల్‌కతా వైద్య విద్యార్థిపై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడిని ఉరితీయాలని షాద్‌నగర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో ప్రభుత్వ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఓపీ సేవలను నిలిపివేసి నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణ ముఖ్య కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వైద్యుల ర్యాలీలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయ్‌కుమార్, రమేశ్, చందూలాల్‌రాథోడ్, ఆనంద్, ప్రేమ్‌కుమార్, రామకృష్ణ, వెంకటరమణ, చంద్రశేఖర్, సురేశ్, కార్తీక్ ఉన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

మొయినాబాద్ : కోల్‌కతాలో పీజీ చేస్తూ జూనియర్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి చేసి హత్యగావించిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్ఎంపీ వైద్యుల అసోసియేషన్ చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు జగన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హంతకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం మొయినాబాద్‌లోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. వి వాంట్ జస్టిస్ నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే హంతకులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు రామచందర్, వీరానందం, మహిపాల్, అరుణ, రమాదేవి, చంద్రకళ, కృష్ణారావు పాల్గొన్నారు

దోషులను కఠినంగా శిక్షించాలి

ఆమనగల్లు : కోల్‌కతాలోని ఆర్‌జీకర్ వైద్య కళాశాల దవాఖానలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్యగావించిన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ దవాఖాన డాక్టర్ పరీక్షిత్ నరేందర్ అన్నారు. ఈ ఘటనకు సంతాపం తెలియజేస్తూ ఆమనగల్లు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారికి చేరుకుని నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వైద్యుల నిరసన

కడ్తాల్ : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి చేసి, దారుణంగా హతమార్చిన ఘటనపై శనివారం కడ్తాల్‌లో ప్రైవేట్ వైద్యులు, జూనియర్ కళాశాల విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు భీంలాల్‌నాయక్, రామచందర్‌నాయక్, శ్రీనివాస్, బాబుయాదవ్, సింహయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి నిరసన

చేవెళ్ల టౌన్ : కోల్‌కతా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థినిని దారుణంగా హత్య చేసిన నిందితులను ఉరితీయాలని ఆర్ఎంపీ వైద్యులు డిమాండ్ చేశారు. దారుణ హత్యకు నిరసనగా శనివారం చేవెళ్ల డివిజన్ పరిధిలోని ఆర్ఎంపీ వైద్యులు తమ విధులను బహిష్కరించి చేవెళ్లలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిరసన చేసి, భారీ ర్యాలీ నిర్వహించారు. మృతిచెందిన వైద్యురాలికి సంఘీభావం తెలిపారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు.

షాద్‌నగర్‌టౌన్ : పట్టణ ముఖ్యకూడలిలో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

మొయినాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ వైద్యులు

కడ్తాల్ : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేస్తున్న ప్రైవేట్ వైద్యులు

చేవెళ్లటౌన్ : చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ వైద్యులు


విద్యుత్ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విద్యుత్ సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 17 : విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యుత్ అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరాలోని సాంకేతిక లోపాలను గమనించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అర్హులైన పేదలందరికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం కోసం గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నదని, గృహజ్యోతి లబ్ధిదారులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. నిరంతరం ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. విద్యుత్ సరఫరా, బిల్లుల విషయంలో తగిన జాగ్రత్తలను పాటించాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు యాదయ్య, రవీందర్, మాధవరావు, ఏఈలు, నాయకులున్నారు.

అలయ అభివృద్ధికి కృషి

షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మ గుట్ట వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పల్లకీ సేవ కార్యక్రమంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఆలయాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని గోమాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, నాయకులు శ్రీశైలం, వెంకటేశ్, బస్వం, శ్రీనివాస్, హరినాథ్, శేఖర్, ప్రవీణ్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఫరూఖ్‌నగర్ మండలంలోని విఠ్యాల గ్రామానికి చెందిన బోయ యాదగిరి అనారోగ్యం కారణంగా ఇటీవల మృతిచెందాడు. యాదగిరి కుటుంబ పరిస్థితులను తెలుసుకొని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జయశ్రీ రూ.8వేలు, వాహబ్, లింగం, మొయినుద్దీన్ రూ.6000 మొత్తం రూ.14 వేలను మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.
షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 17

తండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడుగుల, ఆగస్టు 17 : తండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి తండాను అభివృద్ధి చేస్తానన్నారు. శనివారం మండల పరిధిలోని ఫకీరాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హున్యాతండా నాయకులు మాజీ ఎంపీపీ పద్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే హున్యాతండాలో అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి రూ.2.50లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే మాజీ ఎంపీపీకి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం కొల్కులపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బ్యాగులు అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు అనురాధ, కొండల్‌రెడ్డి, నాయకులు రామావత్ బాషా, జైపాల్, రవి, జగదీశ్, శ్రీను, సంతోష్, పాండు, రాంజీ, సురేశ్, రాజు పాల్గొన్నారు.

శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు


శనీశ్వరస్వామికి తైలాభిషేకం చేస్తున్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 17 : శని త్రయోదశి సందర్భంగా షాద్‌నగర్‌లోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలోని శనీశ్వరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి విశేష తైలాభిషేకం, సహస్రనామార్చన వంటి పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు. విష్ణుమూర్తికి ఇష్టమైన శనివారం, శివుడికి ఇష్టమైన త్రయోదశి రెండు కలిసి వచ్చే రోజున స్వామివారికి పూజలు చేయడం ద్వారా సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం స్వామివారికి భక్తులు విశేష తైలాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్రాంరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, కోశాధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉత్సవాలకు రూ.51వేలు విరాళం

మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.51వేల విరాళాన్ని ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు.
- కడ్తాల్, ఆగస్టు 17

నేడు సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

షాబాద్, ఆగస్టు 17: నేడు షాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గౌడ సంఘం మండల అధ్యక్షుడు బాలాపురం వెంకటేశ్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంటలకు మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో జరిగే ఈ కార్యక్రమానికి గౌడ కులస్తులందరూ పాల్గొనాలని కోరారు.

ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బాలసభ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాలసభ.. భవితకు సోపానం

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు

ఆమనగల్లు, ఆగస్టు 17 : బాలసభ.. విద్యార్థుల భవితకు సోపానమని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలసభలు ఉపయోగపడుతాయన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బాలసభ నిర్వహించారు. విద్యార్థులే ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా, మండల విద్యాధికారులుగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృతాలు, పాటల పోటీలు అందరినీ అలరించాయి. అనంతరం పాండు మాట్లాడుతూ.. బాలసభలతో చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆచారి, కృష్ణయ్య, మాధవి, సుజాత, జ్యోతి, మాలతి, వనిత, కుసుమలత, పద్మ, రమాదేవి, మేరీ, ఫౌండేషన్ వలంటీర్లు కవిత, శ్యామల పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

చిన్నమంగళారం నుంచి వీరన్నపేట్ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఆంజనేయులుగౌడ్

మొయినాబాద్, ఆగస్టు 17 : మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామం నుంచి వీరన్నపేట్ గ్రామం వరకు రోడ్డు గుంతలుగా పడి అధ్వానంగా తయారైంది. దీంతో ఆ రోడ్డుపై వాహనదారులు ప్రయాణించడానికి ఇబ్బందులు పడడంతోపాటు రాత్రి సమయాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. దీంతో గ్రామానికి చెందిన యువ నాయకుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆంజనేయులుగౌడ్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రోడ్డుపై పడిన గుంతలను పూడ్చే కార్యక్రమానికి నడుం బిగించాడు. సుమారు కిలోమీటర్‌కు పైగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, గ్రామ పెద్దలు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

యాచారం : గౌరీదేవిపల్లి 2500కేవీ పంప్‌హౌస్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా ఈ నెల 19 వరకు మండలానికి మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రణయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న యథావిధిగా తిరిగి సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సెక్రటరీలు అందుబాటులో ఉన్న బోరు బావులను వినియోగించి ప్రజలకు మంచినీరు అందుబాటులో ఉంచాలని సూచించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలకు నిధులు మంజూరు

మంచాల : అమ్మ ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు మంచాల ఎంపీడీవో బాలశంకర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచాల మండలంలోని 9 అమ్మ ఆదర్శ పాఠశాలలకుగాను రూ.4లక్షల50వేలు మంజూరు కాగా.. అందులో ఒక్కో పాఠశాలకు రూ.50వేల చొప్పున నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఈ నిధులతో పాఠశాలలో వాటర్, కిచెన్‌షెడ్, కిటికీలు, తలుపులు తదితర వాటికి ఉపయోగించుకోవాలని చెప్పారు.

బీఆర్ఎస్ పాలనలో సబ్బండ వర్గాల్లో ఆనందం

కడ్తాల్, ఆగస్టు 17 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని పల్లెచెల్కతండా గ్రామపంచాయతీకి చెందిన వడ్త్యావత్ లలిత అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందింది. అనంతరం ఆమె సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో రూ.20 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. శనివారం కడ్తాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితురాలు లలితకు దశరథ్‌నాయక్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని తెలిపారు. పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లోకేశ్‌నాయక్, హరిచంద్‌నాయక్, నాయకులు పాండునాయక్, రాజునాయక్, శ్రీను, చందు, భీక్యా, నరేశ్, బాలేందర్, యాదగిరి పాల్గొన్నారు.

బాధితురాలు లలితకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

రాఖీ మహోత్సవం

రాఖీ పండుగకు ఎంతో విశిష్టత ఉందని బ్రహ్మకుమారీస్ అన్నారు. బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో శనివారం చేవెళ్లలో రాఖీ మహోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లుకు రాఖీ కట్టి.. రాఖీ గొప్పదనాన్ని వివరించారు. - చేవెళ్ల టౌన్, ఆగస్టు 17

వివాహానికి ఆర్థిక సాయం

సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. తలకొండపల్లిలో పేద కుటుంబానికి చెందిన సత్యనారాయణ కుమార్తె వివాహానికి శనివారం ట్రస్ట్ తరపున ఉప్పల చారిటబుల్ ట్రస్టు అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ.10వేలు అందజేశారు.
- కడ్తాల్, ఆగస్టు 17

తన పుట్టినరోజు సందర్భంగా బీజేపీ యువ మోర్చా చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ మండల పరిధిలోని పామెన గ్రామంలో నిర్మిస్తున్న వీరభద్ర స్వామి ఆలయానికి రూ. 21 వేలను విరాళంగా మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు.
- చేవెళ్ల రూరల్, ఆగస్టు 17

ఆలయ నిర్మాణానికి విరాళం

కండరాల వ్యవస్థపై సీసీఎంబీలో

జాతీయ స్థాయి వర్క్‌షాప్

సెప్టెంబర్ 20లోపు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడి

సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : కండరాల వ్యవస్థ - వ్యాధి, చికిత్సా విధానాలు, అధ్యయనాలపై పలు పరిశోధన సంస్థలతో కలిసి సీసీఎంబీ జాతీయ స్థాయి వర్క్ షాప్‌ను నిర్వహించనున్నది. నవంబర్‌లో నిర్వహించే ఈ సదస్సులో కండరాల వ్యవస్థ, టిష్యూ డెవలప్‌మెంట్, వ్యాధులు, చికిత్సా విధానాలపై పీహెచ్‌డీ చేసే విద్యార్థులకు అవగాహన కల్పించేలా, పరిశోధనలను మరింత విస్తృతపరిచేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వర్క్‌షాపునకు హాజరయ్యేందుకు సెప్టెంబర్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సీసీఎంబీ వర్గాలు ప్రకటించాయి. ఈ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ జీవశాస్త్ర పరిశోధనా రంగంలో ఉన్న నిపుణులు హాజరవుతారని, పరిశోధనా విద్యార్థులకు ఎంతగానో ఇది సాయపడుతుందని తెలిపారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధికి దరఖాస్తులు

సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి అర్హులైన ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అందించే స్కాలర్‌షిప్‌ను వినియోగించుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు శనివారం పేర్కొన్నారు. విదేశాలలో చదువుకోవాలనుకునే వారికి రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. యూఎస్ఏ, కెనడా, జర్మనీ, జపాన్, సింగపూర్ తదితర దేశాల్లో అభ్యసించే వారికి ఈ పథకం ఉపయోగంగా ఉంటుందని వివరించారు. అక్టోబర్ 10 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు. telanganaepass.cgg.giv.inలో నమోదు చేసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు, జీఆర్ఈ/జీఎంఏటీ, ఇంగ్లిష్ ప్రావీణ్యత పరీక్షల అర్హత కలిగి ఉండాలని తెలిపారు.

పార్థీనియం విషపు మొక్క.. చాలా ప్రమాదకరం

ప్రధాన శాస్త్రవేత్త డా.పద్మజ

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 17 : కలుపు మొక్కల్లో చాలా ప్రమాదమైనది పార్థీనియం మొక్క అని, దీనిని చిరు దశలోనే నివారించాలని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కలుపు విభాగం ప్రధాన శాస్త్రవేత్త డా.బి.పద్మజ అన్నారు. పార్థీనియం అవగాహన వారోత్సవాలపై శనివారం సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎక్కువగా పార్థీనియ కలుపు మొక్కలు అధికంగా పెరిగాయని ఆమె గుర్తు చేశారు. చూడముచ్చటగా, ముక్కుపుడకను పోలి ఉండే ఈ మొక్క పంటలకే కాకుండా, మనుషులకు, పశువులకు హాని కలిగిస్తాయని తెలిపారు.